విశ్వవిద్యాలయ స్థాయి తొలి తెలుగు వార పత్రిక

# నన్నయ వాణి

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం - ఆంధ్రప్రదేశ్

: www.aknu.edu.in
: nannayavani@aknu.edu.in
: nannayanewstv
: Adikavi Nannaya University
: 9701293231

గౌరవ సంపాదకులు
ఆచార్య మొక్కా జగన్నాథరావు
ఉపకులపతి

ప్రధాన సంపాదకులు
ఆచార్య తుపాకుల అశోక్
కుల సచివులు

సంపాదకులు
డా.తలారి వాసు, సహాయాచార్య, తెలుగు శాఖ
పువ్వల ఆనంద్, ప్రజా సంబంధాల అధికారి, కోఆర్డినేటర్, మీడియా సెల్

సంపుటి : 2 | సంచిక : 50 | 19-09-2022 | పుటలు : 4


## గురజాడ జయంతి

గురజాడ వేంకట అప్పారావు

(21.9.1862 - 30.11.1915)



దేశమును ప్రేమించుమన్నా
మంచి అన్నది పెంచుమన్నా
వొట్టి మాటలు కట్టిపెట్టోయి
గట్టిమేలు తలపెట్టవోయి!

యీసురోమని మనుషులుంటే
దేశమే గతి బాగుపడునోయి?

మందగించక ముందుకడుగేయి
వెనక పడితే వెనకే నోయి!

వ్యర్థ కలహం పెంచబోకోయి
కత్తి వైరం కాల్చవోయి!

ఒరుల మేలుకు సంతసిస్తూ
ఐకమత్యం నేర్చవోయి!

స్వంత లాభం కొంత మానుకు
పొరుగు వాడికి తోడుపడవోయి!


అన్నదమ్ముల వలెను జాతులు
మతములన్నీ మెలగవలెనోయి!

నరుల చెమటను తడిసి మూలం
ధనం పంటలు పండవలెనోయి!

ఆకులందున అణగి మణగి

కవిత కోకిల పలకవలెనోయి పలుకులను
విని దేశమందభి మానములు
మొలకెత్తవలెనోయి!!

## మంచిమాట



పారిశుద్ధ్యం అనేది అన్నింటికన్నా ముఖ్యమైన విషయం. ఆరోగ్యకరమైన మనస్సు ఆరోగ్యకరమైన శరీరంలోనే ఉంటుంది.

- మహాత్మా గాంధీ

## అంబరాన్నంటిన అద్వీక 22

# నేషనల్ టెక్ ఫెస్ట్ సంబరాలు

**15.09.22 (మీడియాసెల్)**

భారతరత్న సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి మరియు ఇంజనీర్స్ డే సందర్భంగా ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ ఆధ్వర్యంలో అద్విక 22 నేషనల్ టెక్ ఫెస్టివల్ ను నిర్వహించారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం రాజమంహేద్రవరం, కాకినాడ, తాడేపల్లిగూడెం క్యాంపస్ లతో పాటు ఉమ్మడి గోదావరి జిల్లాల్లోని ఇంజనీరింగ్ కళాశాలల నుండి పెద్దఎత్తున విద్యార్థులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ టెక్ ఫెస్ట్ కు కన్వీనర్ గా ప్రిన్సిపాల్ డా.వి.పెర్సిస్, కోకన్వీనర్ జె.హనుమంతులు వ్యవహరించారు. అద్విక టెక్నికల్ ఫెస్టిలో ప్రధానంగా నిర్వహించిన టెక్నికల్ ప్రెజెంటేషన్, టెక్నికల్ టాక్, టెక్నికల్ క్విజ్, ప్రోజెక్ట్ ఎక్స్.పో మరియు ప్రోజెక్ట్ ప్రెజెంటేషన్ లను వీసీ పరిశీలించారు. అన్ని కళాశాలల నుండి వచ్చిన ఇంజనిరింగ్ విద్యార్థులు ఈ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొని తమ ప్రతిభను కనపరిచారు. విశ్వవిద్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఎంటర్టైన్మెంట్, గేమ్స్, ఫూడ్ స్టాల్స్ లో విద్యార్థులు సందడి చేసారు. అలాగే యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ విద్యార్థులు నిర్వహించిన ఫ్లాష్ మాబ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ లోని అయా విభాగాల విద్యార్థులు ఎంతో ఉత్సాహంతో డాన్స్ చేసి అందరిని అలరించారు. యూనివర్సిటీ బాస్కెట్ బాల్ కోర్ట్ లో ఏర్పాటు చేసిన ముగింపు సమావేశానికి ముఖ్య అతిథిగా వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు హాజరై విద్యార్థులనుద్దేశించి ఉపన్యసించారు. వీసీ మాట్లాడుతూ ఇటీవల కాలంలో విశ్వవిద్యాలయం ఎంతో అభివృద్ధి సాధించిందని, యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కు ఎ.ఐ.సి.టి.ఇ. గుర్తింపు తీసుకువచ్చామని అన్నారు. కోవిడ్ తరువాత ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో జరిగిన పెద్ద కార్యక్రమంగా ఇంజనీర్స్ డే ను అద్విక22 పేరుతో నిర్వహించిన యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ వారిని అభినందించారు. ఇంజనీరింగ్ విద్యార్థుల సృజనాత్మకశక్తిని వెలికితీయడానికి ఇటువంటి టెక్నికల్ ఫెస్ట్ లు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. ఇంజనీరింగ్ విద్యార్థులు ఎప్పటికప్పుడు సృజనాత్మక ఆలోచనలతో ఆవిష్కరణలు చేపట్టాలన్నారు. భవిష్యత్ లో సమాజహితమైన ఇంజనీరింగ్ ఆవిష్కరణలతో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ఇంజనీరింగ్ విద్యార్థులు ప్రతిభ కనపరచాలన్నారు. తరువాత ప్రత్యేక అతిథులుగా విచ్చేసిన సి.ఎస్.ఐ.ఆర్ - ఎన్.ఎ.ఎల్ బెంగళూరు సీనియర్ ప్రిన్సిపాల్ సైంటిస్ట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు, ఓఎన్జిసి అసెట్ మేనేజర్ అమిత్ నారాయణ ఉపన్యసించారు. అనంతరం వివిధ కార్యక్రమాలలో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు పురస్కారాలను అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అధికారులు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.




మోక్షగుండం విశ్వేశ్వరయ్య కు నివాళి అర్పిస్తున్న వీసి, అతిథులు



ఇంజనీరింగ్ ప్రాజెక్టులను పరిశీలిస్తున్న వీసీ

### ఇటీవల కాలంలో ఇంజనీరింగ్‌లో విప్లవాత్మక మార్పులు వచ్చాయి



విద్యార్థులు వాటిని అవగాహన చేసుకుంటూ, ఎప్పటికప్పుడు అప్డేట్ గా విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి. ఆదికవి నన్నయ వంటి మహనీయుల పేరుతో ఏర్పడిన విశ్వవిద్యాలయంలో చదువుతున్న విద్యార్థులందరూ ఇంజనీరింగ్ లో ఉన్నత స్థానాలను అధిరోహించాలి.

**డాక్టర్ కె.వెంకటేశ్వర్లు**
సీనియర్ ప్రిన్సిపాల్ సైంటిస్ట్
సి.ఎస్.ఐ.ఆర్ - ఎన్.ఎ.ఎల్ బెంగళూరు

### సృజనాత్మకతతో గొప్ప ఆవిష్కరణలను ఇంజనీరింగ్ విద్యార్థులు చేపట్టాలి

ఇంజనీరింగ్ రంగంలో అవకాశాలను అందిపుచ్చుకుంటూ సమర్థవంతమైన ఇంజనీర్లుగా అభివృద్ధి చెందాలి. భవిష్యత్తులో విశ్వవిద్యాలయ విద్యార్థులందరూ గొప్ప ఇంజనీర్స్ గా ఎదిగి సమాజానికి సేవలందించాలి.



**అమిత్ నారాయణ**
ఓఎన్జిసి అసెట్ మేనేజర్,
రాజమహేంద్రవరం.

## సంపాదకీయం



# సంపద

మన చుట్టూ ఏముందో మనం కూడా దానిలోనే భాగమవుతామనేది మంచి మాట. అవును. పులిహూర తింటే పులిహూర తేనుపే వస్తుంది. బిర్యానీ తింటే బిర్యాని తేనుపే వస్తుంది. మరొకటి రాదు కదా! ఎటువంటి వ్యక్తులతో సాంగత్యాన్ని కలిగి ఉంటామో అటువంటి వారి ప్రభావం మన మీద ఎక్కువగా ఉంటుంది. ఎటువంటి పుస్తకాలు చదువుతున్నామో అటువంటి భావజాలాన్ని మనం కలిగి ఉంటాం.

నిరాశా జనకమైన వ్యాఖ్యానాలు చేస్తూ మనల్ని వెనక్కిలాగే వ్యక్తులు మన పురోగతిని అడ్డుకోవడానికి ప్రయత్నిస్తారు. మనల్ని తక్కువ చేస్తూ, నిందిస్తూ వాళ్ళు ఆనందపడతారు.మనల్ని ఉసూరుమనేలా చేసి నిస్సత్తువ ఆవహించేలా ప్రయత్నిస్తారు. ప్రతికూలమైన వ్యక్తుల సాంగత్యం, సమక్షం వల్ల మనకు కలిగే ప్రయోజనాలు ఏమీ ఉండవు. వాళ్ళు మన మార్పును,ప్రగతిని కోరుకోరు. అంగీకరించరు. సరికదా మనకు ఇబ్బందుల్ని సృష్టిస్తారు. ప్రతికూలమైన ఆలోచనలు కలిగిన వారికి దూరంగా జీవించటం కూడా అద్భుతమైన కళ. ప్రయత్నించి ప్రశాంతతను పొంది చూడండి.

సానుకూలమైన వ్యక్తుల సాంగత్యం పెంచుకునే కొద్దీ ఒక కొత్త శక్తిని పుంజుకుంటాం. అంతేకాదు సానుకూలమైన వ్యక్తులుగా ఎదుగుతాం కూడా! దానివల్ల గొప్ప ఉత్సాహం జీవితం నిండా అలముకుని ఉంటుంది. కల్మషం లేని వ్యక్తులు నిరంతరం మనకు సహకారంగా ఉంటారు. గొప్ప ఉత్తేజాన్ని మనలో నింపుతారు. అటువంటి వారి సమక్షం మనకు ఆనందాన్నిస్తుంది.

శ్రేయస్సును కోరుకునే వ్యక్తుల్లో ఒక అద్భుతమైన శక్తి దాగి ఉంటుంది. అటువంటి వారితో గడిపినప్పుడు, మాట్లాడినప్పుడు, మన విషయాలను పంచుకున్నప్పుడు కొత్త శక్తిని స్ఫూర్తిని పొందుతాం.వారి సలహాలు, ఆలోచనలు,సహకారాలు మనల్ని విజేతల్ని చేస్తుంటాయి.అంతేకాదు అటువంటి వ్యక్తులుగా మనం తయారవుతాం కూడా!

మనకు స్ఫూర్తినిచ్చే ఇష్టమైన మన టీచర్లతో, మిత్రులతో, వైద్యులతో, బంధువులతో మాట్లాడినప్పుడు గొప్ప అనుభూతికి లోనవుతాం. కేవలం వారి మాట చాలు మనం హాయిగా జీవించటానికి.ఆరోగ్యంగా ఉండటానికి.

ఒక మాట, లేదంటే పాట పదేపదే వింటున్నప్పుడు అది మన మనసులో తిష్ట వేసుకుని ముందు వరసలో కూర్చుంటుంది.అందుకనే ముందు వరసలో కూర్చోబెట్టటానికి కావలసిన వ్యక్తులు కొంతమంది మనకు కావాలి.అటువంటి వారే మనలో దార్శనికతను విస్తృత పరుస్తారు. మన లోపాల్ని సరిదిద్దుతారు. మనకు సహకరిస్తారు. వాళ్లే మన నిజమైన సంపద. సంపద అనే మాటకు అర్థం ధనం, భూమి, ఇల్లు,లోహాలు, సౌకర్యాలు, వస్తువులు అని మాత్రమే కాదు.మనుషుల హృదయాల్లో మనం సంపాదించుకున్న చోటు అని కూడా అర్థం!

# ప్లేస్మెంట్ డ్రైవ్‌లో కెమిస్ట్రీ విద్యార్థులకు ఉద్యోగాలు

**11.09.22 (మీడియాసెల్)**

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్లేస్మెంట్ డ్రైవ్ లో కెమిస్ట్రీ విద్యార్థులకు ఉద్యోగాలు లభించాయని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. దీనికి సంబంధించిన వివరాలను వీసీ తెలియజేస్తూ యూనివర్సిటీ ప్లేస్మెంట్ సెల్ ఆధ్వర్యంలో హెట్రో డ్రగ్స్ ప్రైవేట్ లిమిటెడ్ నక్కపల్లి వారు నిర్వహించిన ఈ ప్లేస్మెంట్ డ్రైవ్ లో క్వాలిటీ కంట్రోల్, క్వాలిటీ అసెస్మెంట్, కెమిస్ట్రీ రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ మరియు ప్రొడక్షన్ కెమిస్ట్ వంటి ఉద్యోగాలు లభించాయన్నారు. బీఎస్సీ కెమిస్ట్రీ, ఎంఎస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ, ఎనలిటికల్ కెమిస్ట్రీ, ఇంటిగ్రేటెడ్ కెమిస్ట్రీ, ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ విద్యార్థులు ఈ ప్లేస్మెంట్ డ్రైవ్ కు హాజరయ్యారని వీరికి ఆన్లైన్ విధానంలో పరీక్ష నిర్వహించి ప్రతిభకనపరచిన అభ్యర్థులను ఎంపిక చేసారని చెప్పారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులు పనిలో



అనుభవాన్ని సంపాదించుకోవాలని త్రికరణశుద్ధిగా విధులు నిర్వహించాలని విశ్వవిద్యాలయానికి మంచి పేరును తీసుకురావాలని సూచించారు. మిగిలిన విద్యార్థుల కెమిస్ట్రీ పాఠ్యాంశాలపై మరింత పట్టు సాధించాలని, కమ్యూనికేషన్ స్కిల్స్ ను అభివృద్ధి చేసుకొని త్వరలో చక్కని ఉద్యోగాలను సాధించాలని తెలియజేసారు. అనంతరం ఎంపికైన విద్యార్థులకు అపాయింట్మెంట్ ఆర్డర్లను అందజేసి అభినందించారు. ప్రతిభ ఆధారంగా మిగిలిన విద్యార్థులకు కూడా ఉద్యోగాలు కల్పిస్తామని హెచ్ఆర్ లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ ప్లేస్మెంట్ ఆఫీసర్ డా.బి.జగన్మోహన్ రెడ్డి, హెట్రో డ్రగ్స్ ప్రైవేట్ లిమిటెడ్ నక్కపల్లి హెచ్.ఆర్. ప్రశాంత్, అరుణ్, వంశి మరియు అధ్యాపకులు పాల్గొన్నారు.

# గూడెం క్యాంపస్‌లో ఓజోన్ పరిరక్షణ ప్రోగ్రామ్



ఐక్యరాజ్యసమితి ప్రతిపాదించిన అంతర్జాతీయ ఓజోన్ పొర దినోత్సవం సందర్భంగా ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, ఫార్మసీ విభాగం కొత్త ఫార్మసీ భవనం దగ్గర ప్లాంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. క్యాంపస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కొట్టి శ్రీరమేష్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమం ఫార్మసీ సౌభ్రాత్రాన్ని, ప్రకృతి ప్రాముఖ్యాన్ని, దాని విలువలను తెలియజేసి, ప్రతి విద్యార్థి క్యాంపస్‌లో, పరిసరాల్లో మొక్కలు నాటాలని, వాటిని సంరక్షించాలని సూచించారు. ఫార్మసీ విభాగం సమాజంలో ప్రజలను జాగృతం చేయడానికి సమాజహితమైన పలు కార్యక్రమాలను నిర్వహిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఫార్మసీ సిబ్బంది డిపార్ట్మెంట్ కోర్స్ కోఆర్డినేటర్ డా. హీరా బట్టు, మరియు ఫార్మసీ అధ్యాపకులు డా.ఎల్. సురేంద్రబాబు, కె. నిత్యానందరెడ్డి, శ్రీమతి పి. అరుణ, మరియు విద్యార్థులు చురుకుగా పాల్గొని మొక్కలు నాటారు.

# క్రీడలను ప్రోత్సహించేందుకు కృషి చేస్తా

**15.09.22 (మీడియాసెల్)**

ఉమ్మడి గోదావరి జిల్లాల్లోని ఆదికవి నన్నయ విశ్వవిద్యా లయం పరిధిలో క్రీడలను ప్రోత్సహించేందుకు కృషి చేస్తానని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం వీసీ కార్యాలయంలో గురువారం ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ అసోసియేషన్ నాయకులు వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావును కలిసి విశ్వవిద్యాలయ పరిధిలోని క్రీడాభివృద్ధికి సంబంధించిన వినతిపత్రాన్ని అందజేసారు. దీనిపై వీసీ సానుకూలంగా స్పందించి త్వరలో వాటిని పరిష్కరిస్తామని అన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఇటీవల కాలంలో క్రీడాల్లో ఎంతో ప్రతిభను కనపరిచిందని జాతీయ స్థాయిలో నన్నయ క్రీడాకారులు సత్తాచాటారని చెప్పారు. యూనివర్సిటీ స్పోర్ట్స్ జనరల్ బాడీ మీటింగ్ ను త్వరలో ఏర్పాటుచేస్తామన్నారు. క్రీడాకారులకు ఇచ్చే ప్రోత్సాహాలను మెరుగుపరుస్తామన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ ఈవెంట్ ను నిర్వహించి నన్నయ క్రీడా ప్రతిభను చాటుదామని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ అసోసియేషన్ నాయకులు డా.బి.వి.నరసింహరాజు (డి.ఎన్.ఆర్ భీమవరం), డా.ఎస్.వి.వి.ఎల్. జి.వర్మ (పి.ఆర్.జి.కాలేజ్ కాకినాడ), డా.డి.వి.రమణ (పి.ఆర్.జి.కాలేజ్ కాకినాడ), డా.జి.వి.పవన్ కుమార్ రాజు (విష్ణుకాలేజ్ భీమవరం) పాల్గొన్నారు.



**వీసీ జగన్నాథరావు కు వినతిపత్రం అందిస్తున్న స్పోర్ట్స్ అసోసియేషన్**




# ఉత్సాహంగా అద్విక 22 నేషనల్ టెక్ ఫెస్ట్


















# ఓజోన్ పరిరక్షణ దినోత్సవం



ప్రతిజ్ఞ చేస్తున్న అధ్యాపకులు

**16.09.22 (మీడియాసెల్)**
ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ విద్యావిభాగం ఆధ్వర్యంలో సోషల్ సైన్స్ క్లబ్ వారు శుక్రవారం ఓజోన్ పరిరక్షణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఓజోన్ పొర ఆవశ్యకతను ప్రిన్సిపాల్ డా.కె.సుబ్బారావు తెలియజేసారు. క్లబ్ అధ్యక్షులు డా.వి.రామకృష్ణ మాట్లాడుతూ ఐక్యరాజ్యసమితి 1994 సెప్టెబర్ 16వ తేదీని ఓజోన్ పరిరక్షణ దినోత్సవంగా పెర్కొందన్నారు. నాటినుండి ప్రతీ ఏడాది ప్రపంచ వ్యాప్తంగా కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. ఈ ఏడాది "భూమిపై మానవాళి పరిరక్షణ ప్రపంచ సహకారం" అనే నినాదంతో కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. ఓజోన్ పరిరక్షణ ప్రతిజ్ఞను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఈడీ కళాశాల అధ్యాపకులు డా.వి.రామకృష్ణ, ఆర్.సాంబశివరావు, డా.జె.రాజమణి, డా.సుజాత, డా.ఆర్.ఎస్.వి.దొర, రాజేశ్వరిదేవి మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# నన్నయలో గ్రీన్ ఎన్విరాన్మెంట్ ఆడిట్

**16.09.22 (మీడియాసెల్)**
ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో గ్రీన్, ఎన్విరాన్మెంట్ అండ్ ఎనర్జీ అండ్ జెండర్ ఐ.ఎస్.ఓ. సర్టిఫికేషన్ లో భాగంగా ఆడిటింగ్ ను నిర్వహించారు. హిమ్ ఇంటర్నేషనల్ సర్టిఫికేషన్ లీడ్ ఆడిటర్ ఆలపాటి శివయ్య విశ్వవిద్యాలయం రాజమహేంద్రవరం ప్రాంగణంలో ఆడిట్ ప్రక్రియను నిర్వహించారు. యూనివర్సిటీ నాక్, ఐ.క్యూ.ఎ.సి ఎగ్జిక్యూటీవ్ కోఆర్డినేటర్ డా.కె.వి.స్వామి అధ్యక్షతన ఈసీ హాల్ లో అన్ని విభాగాధిపతులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో హాజరైన లీడ్ ఆడిటర్ శివయ్య ఆయా విభాగాధ్యాపకులకు వేస్ట్ మేనేజ్మెంట్ కు సంబంధించిన పలు సూచనలనందించారు. ఈ సందర్భంగా శివయ్య మాట్లాడుతూ యూనివర్సిటీ గ్రీన్, ఎన్విరాన్మెంట్ లో భాగంగా ఎంతో ఉన్నతంగా ఉందని అన్నారు. భూగర్భ జలాల పరిరక్షణకు విశ్వవిద్యాలయం ఎంతో ప్రాధాన్యతనిచ్చిందని విశ్వవిద్యాలయంలో ఉన్న చెరువులతో పాటు ఇంకుడుగుంతలు, చెక్ డ్యామ్స్ పత్యేకతలుగా నిలిచాయన్నారు. అటవీశాఖ వారి సహకారంతో విస్తారంగా మొక్కలను పెంచుతూ విశ్వవిద్యాలయాన్ని ప్రకృతి ఒడిగా


లీడ్ ఆడిటర్ శివయ్యను సన్మానిస్తున్న వీసీ జగన్నాథరావు

తీర్చిదిద్దుతున్నారని చెప్పారు. ఎనర్జీ కి సంబంధించి సోలార్ పవర్, ఎల్.ఈ.డీ లైట్స్ ను ఉపయోగిస్తున్నారని తెలిపారు. అనంతరం వీసీ కార్యాలయంలో వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావును కలిసారు. ఆడిట్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించామని రిపోర్టును సబ్మిట్ చేసి త్వరలోనే సర్టిఫికెట్ ను అందజేస్తామన్నారు. ఈ సందర్భంగా వీసీ జగన్నాథరావు లీడ్ ఆడిటర్ ఆలపాటి శివయ్యను సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, డా.కె.వి.స్వామి, మురళి తదితరులు పాల్గొన్నారు.


# డిగ్రీ ఆరవ సెమిస్టర్ ఫలితాలను విడుదల చేసిన వీసీ

**17.09.22 (మీడియాసెల్)**
ఉభయగోదావరి జిల్లాల్లోని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం పరిధిలో డిగ్రీ ఆరవ సెమిస్టర్ పరీక్షా ఫలితాలను వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు విడుదల చేశారు. దీనికి సంబంధించిన వివరాలను వీసీ తెలియజేస్తూ ఉమ్మడి గోదావరి జిల్లాల్లోని డిగ్రీ ఆరవ సెమిస్టర్ బిఏ, బికామ్, బిబిఏ, బిఎస్సీ, బిసిఎ, ఒకేషనల్ కోర్సులలో మొత్తం 26554 మంది విద్యార్థులు పరీక్షలు వ్రాసారని వారిలో 20447 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని చెప్పారు. ఉత్తీర్ణతా శాతం 77 గా ఉందని తెలిపారు. పరీక్ష ఫలితాల వివరాలను యూనివర్సిటీ వెబ్సైట్ www.aknu.edu.in ద్వారా పొందవచ్చునని అన్నారు. సమర్థవంతంగా మూల్యాంకనం చేసి ఫలితాలు అందించిన విశ్వవిద్యాలయ పరీక్షా విభాగ అధికారులను, సిబ్బందిని వీసీ అభినందించారు.

# భారతదేశ వీరనారీమణులు పుస్తకం



భారతదేశం అనేకమంది వీరనారీమణులకు పుట్టినిల్లు. వీరిలో రుద్రమదేవి,సరోజినీ నాయుడు,ఝాన్సీ లక్ష్మీబాయి,సావిత్రిబాయి గురించి మనకి కొంత తెలుసు.కానీ పరిపాలనా దక్షతకు, స్వాతంత్ర్య పోరాటానికి, త్యాగానికి ప్రతీకగా నిలిచిన మనకు తెలియని ఎంతోమంది వీరనారీమణుల గురించి, వారి సాహస గాథలను, కథలను గురించి "జ్వాలామణులు" పేరుతో రాశారు సన్నపునేని రాజశేఖర్. రాణి నాయకదేవి ఘోరిమహమ్మద్ ను తుక్కుతుక్కుగా ఓడించింది.తమ గ్రామ మహిళలను అపహరణకు గురికాకుండా పోర్చుగీసు పాలకులతో వీరోచితంగా పోరాడి వారికి చెమటలు పట్టించింది రాణి అబ్బక్క దేవి.2015 లో మోడీ ప్రభుత్వం ఒక యుద్ధ నౌకకు రాణి అబ్బక్క దేవి పేరు పెట్టి రుణం తీర్చుకుంది.1857 తొలి స్వతంత్ర పోరాటంలో బ్రిటిష్ వారికి ఎదురుతిరిగిన మహిళల్లో బేగం హజ్రత్ మహల్ ఒకరు. బ్రిటిష్ వారు తమ ప్రాంతంలో బలవంతంగా పన్నులు వసూలు చేయడానికి వస్తే బ్రిటిష్ అధికారాన్ని సవాలు చేసింది రోపు




ఇలియాని.అలాగే బ్రిటిష్ వారి దుష్టపాలనను గుడ్డిగా అనుసరించకుండా ధైర్యంగా పోరాడాలని పొరుగు రాజ్యాలకు దిశానిర్దేశం చేసింది రాయగడ్ రాణి అవంతిబాయి. మీరట్ ప్రాంతంలో 30 మంది స్వాతంత్ర్య సమరయోధులను బ్రిటిష్ వారు ఉరితీస్తే పదహారేండ్ల శివదేవి మిగతా యువతులతో కలిసి బ్రిటిష్ సైనికులపై దాడిచేయడమే కాకుండా వారిలో కొందరని చంపింది కూడా.శరీరంలోకి తుపాకీ గుండ్లు వెళ్తున్నా లెక్కచేయకుండా వందేమాతరం అంటూ పాడి జాతీయజెండాని ఎత్తి పట్టుకున్న వీరవనిత మాతంగిని హజ్రా.స్వరాజ్యం కోసం సాయుధ దళాలను సమీకరించిన గులాబ్ కౌర్, చంద్రశేఖర్ ఆజాద్ పోరాటానికి అనేక విధాలుగా సహాయం చేసిన రాజ్ కుమారి గుప్త, ఒక పోలీస్ స్టేషన్ లో జాతీయ జెండాను ఎగురవేసేందుకు ప్రయత్నించి తుపాకీ గుళ్ళకు బలైన కనకలత బరువా వంటి వారి గురించి మనకు తెలియని ఎన్నో విషయాలను గురించి చక్కగా వివరించారు రచయిత. ప్రజల చేత విశేషంగా గౌరవించబడినది ఇండోర్ పాలకురాలు అహల్యాబాయి.వడికిన ఖాదీని భుజాల మీద వేసుకొని, దేశభక్తి గీతాలు పాడుతూ ప్రజల్లో చైతన్యం నింపింది ఓరుగంటి మహాలక్ష్మమ్మ.ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని జైలుశిక్ష అనుభవించిన తొలి భారతీయ మహిళ రుక్మిణీ లక్ష్మీపతి.ఎక్కడో ఐర్లాండ్ లో పుట్టి, వివేకానంద శిష్యురాలు అయ్యి మన దేశం కోసం సర్వశక్తులు దారబోసింది సిస్టర్ నివేదిత.స్వాతంత్ర్యం కోసం 12 ఏళ్ల వయసు నుంచే విరాళాలు సేకరించి తన చేతి బంగారుగాజులు సైతం మహాత్మా గాంధీ కి దానం చేసింది దుర్గాబాయి దేశ్ ముఖ్. ఇటువంటి వీర మణుల జీవిత చరిత్ర, వారి త్యాగం, వారి సాహస గాథలు,తెగువ, దేశభక్తి చూస్తుంటే మన నరనరాలు ఉప్పొంగుతాయి.స్వాతంత్ర్య పోరాటంలో, సాంస్కృతిక పునరుజ్జీవనంలో మహిళల పాత్ర తక్కువేమీ కాదని, వారి గురించి మనం తెలుసుకోవాల్సింది ఇంకా చాలా ఉందని ఈ పుస్తకం చదివితే అందరికీ అర్థం అవుతుంది.40 మంది మనకు తెలియని వీరనారీమణుల త్యాగం,తెగువ, దేశభక్తిని మనలో నరనరనా పుట్టించి,మనల్ని ఆలోచింపజేసేలా,అందరినీ చదివించేలా,హృదయానికి హత్తుకునేలా రాసిన నన్నపనేని రాజశేఖర్ అభినందనీయులు.

**– బి.సుశాంత్ కుమార్,**
**సెకండ్ బీఈడీ,**
**ఆదికవి నన్నయ యూనివర్సిటీ**

ప్రచురణ : మీడియా సెల్, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం-రాజమహేంద్రవరం, ఈమెయిల్ :- nannayavani@aknu.edu.in